అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



రామంతాపూర్ : ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం గడ్డం ప్రత్యూష శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను అలరించింది.

ముగిసిన అంత్యక్రియలు



రాజు అంత్యక్రియల్లో పాల్గొన్న ఎంపీ ఈటల తదితరులు

రామంతాపూర్: మనస్థాపంతో మల్కాజిగిరి పార్లమెంట్ బీజేవైఎం కన్వీనర్ ఉప్పల్‌కు చెందిన రావెల్లిరాజు శుక్రవారం ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. శనివారం ఉప్పల్‌లో అశ్రునయనాలతో నిర్వహించిన ఆయన అంత్యక్రియల్లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి పాల్గొని నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం

బోడుప్పల్: ఉద్యోగానికి వెళ్లిన ఓ యువతి కనిపించకుండా పోయిన ఘటన శనివారం మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయపురి కాలనీలో నివసించే బాపురెడ్డి పెద్ద కుమార్తె కావ్య(21) గత రెండు నెలలుగా మల్లాపూర్‌లోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ఈ క్రమంలో ఈనెల 9న ఉదయం 8 గంటలకు రోజూ మాదిరిగా ఉద్యోగానికి వెళ్లి, సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరొక చోట

అల్వాల్: ఓ మహిళ అదృశ్యమైన ఘటన నేరెడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరెడ్‌మెట్ జేజేనగర్‌లో నివసించే చిన్నబోయిన ప్రశాంత్ భార్య హరీష (21)లకు రెండు నెలల క్రితం వివాహమైంది. ఈనెల 9న హరీష ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆచూకీ కోసం తెలిసిన చోట వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్మశానవాటిక కబ్జాపై ఫిర్యాదు



అహ్మద్‌గూడ శ్మశానవాటికను పరిశీలిస్తున్న హైడ్రా సిబ్బంది

కీసర: అహ్మద్‌గూడలోని శ్మశానవాటిక కబ్జా అవుతుందని గ్రామస్తులు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. శనివారం హైడ్రా అధికారులు శ్మశానవాటికను సందర్శించి కబ్జా అవుతున్న స్థలాన్ని పరిశీలించి ప్రాథమిక విచారణ చేపట్టారు. త్వరలో తగిన చర్యలు తీసుకుంటామని వారు స్పష్టం చేశారు. హైడ్రా అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

ఉప్పల్: గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న 8 కిలోల గంజాయిని శనివారం ఉప్పల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరు వ్యక్తులు చిలుకానగర్ ఆదర్శనగర్ నుంచి చిలుకానగర్ చౌరస్తాకు ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. బెంగళూరుకు చెందిన దీలిక్‌కాలే (28) గచ్చిబౌలికి చెందిన తేజస్ మంజునాథ్ (20) ఒడిశాకు చెందిన మోహన్ నుంచి 8 కిలోల గంజాయిని రూ.66 వేలకు కొనుగోలు చేసి తేజస్ అనే స్నేహితుడి సాయంతో విక్రయించేందుకు నగరానికి కాలేజీ బ్యాగ్‌లో (టీఎస్ 09 పీఏ3537) ద్విచక్రవాహనంపై తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో అనుమానం వచ్చిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా గంజాయి బయటపడింది. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

మేడ్చల్: మేడ్చల్ మీదుగా వెళ్తున్న 44వ జాతీయ రహదారిపై రోజూ ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ నేతలు ట్రాఫిక్ పోలీసులను కోరారు. శనివారం నాయకులు మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వినతిపత్రం అందజేశారు. ట్రాఫిక్ పోలీసులు సమస్య పరిష్కారానికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ నేతలు భాస్కర్‌యాదవ్, నవీన్‌రెడ్డి తదితరులున్నారు.

కరిచేస్తున్నాయ్ !

● బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కల బెడద ● నియంత్రించాలని ప్రజల విజ్ఞప్తి



మల్లిఖార్జుననగర్‌లో తిరుగుతున్న వీధి కుక్కలు

గౌతంనగర్: డివిజన్‌లో వీధి కుక్కలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రోడ్డుపై నుంచి వెళ్లే వారిని వెంటపడి కరిచి గాయపరుస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా వీధి కుక్కలు కాలనీల్లో గుంపులుగుంపులుగా తిరుగుతూ.. దాడి చేస్తున్నాయని తెలిపారు.

- ఇటీవల మల్లికార్జుననగర్‌కు చెందిన శ్రీధర్ కిరాణాషాప్‌కు వెళ్లి తిరిగొస్తుండగా.. వీధికుక్క వెంటపడటంతో తీవ్రంగా గాయపరిచింది. ప్రస్తుతం అతడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.
- ఏడాది క్రితం టైలర్‌షాప్ నిర్వహించుకునే వ్యక్తిపై సైతం వీధి కుక్క దాడి చేయడంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకుని ప్రాణాలతో బయటపడ్డాడు.
- 6 నెలల క్రితం మల్లికార్జుననగర్‌లోని భౌద్దమందిర్ సమీపంలో సుమారు 19 ఏళ్ల యువకుడిని వీధి కుక్కలు కరవడంతో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు సమాచారం. గత రెండేళ్ల క్రితం మల్లికార్జుననగర్‌లో నివసించే 14 ఏళ్ల రిత్విక్ అనే బాలుడిని కరిచి గాయపరిచాయి. దీంతో కుటుంబసభ్యులు బాలుడిని చికిత్స నిమిత్తం నారాయణగూడలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారని కాలనీవాసులు పేర్కొన్నారు.

ఒంటరిగా వెళ్లాలంటే భయమేస్తోంది



కాలనీలో వీధి కుక్కలు గుంపులుగుంపులుగా తిరుగుతున్నాయి. ఒంటరిగా వెళ్లాలంటే భయమేస్తోంది. వాటిని ఏమీ..? అనకున్నా.. వెంటపడి కరిచేందుకు వస్తున్నాయి. సంబంధిత అధికారులు దీనిపై దృష్టిసారించి కుక్కల నుంచి రక్షించాలి.

– స్వాములు, మల్లికార్జుననగర్

వెంటపడి గాయపరిచింది



ఇటీవల మా సోదరుడు శ్రీధర్ కిరాణాషాప్‌నకు వెళ్లి నిత్యావసర వస్తువులు తీసుకొస్తుండగా.. వీధికుక్క వెంబడించి దాడిచేయడంతో తీవ్ర గాయాలపాలై రక్తస్రావం జరిగింది. వైద్యులను సంప్రదిస్తే నారాయణగూడ వెళ్లి చికిత్స తీసుకోమని చెప్పారు. ఇప్పుడు మా సోదరుడి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

– చక్రవర్తి, మల్లికార్జుననగర్

నిండు జీవితానికి రెండు చుక్కలు !

● పల్స్ పోలియో మందు పంపిణీకు ఏర్పాట్లు పూర్తి
● ఉప్పల్ ప్రాథమిక ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ సౌశీల్య





రామంతాపూర్: ఐదేళ్ల లోపు చిన్నారులను పలు వ్యాధుల నుంచి రక్షించేందుకు పోలియో మోతాదు ప్రతిసారి ఇవ్వాల్సిన అవసరం ఉందని ఉప్పల్ ప్రాథమిక ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ సౌశీల్య అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నేడు నిర్వహిస్తున్న పల్స్ పోలియో ఉప్పల్ మండల పరిధిలోని మౌలాలి, మల్లాపూర్, నాచారం, హబ్సిగూడ, రామంతాపూర్, ఉప్పల్, చిలుకానగర్, కొత్తపేట్, నాగోల్ తదితర ప్రాంతాల్లో 1509 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తాయని స్పష్టం చేశారు.

◆ మండలంలోని పలు బస్తీలు, కాలనీల్లో ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు అవగాహన కల్పించారని ఆమె తెలిపారు. ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించి వారికి రక్షణ కల్పించాలని ఆమె సూచించారు. ప్రయాణాల్లో ఉండి లేదా ఏ ఇతర కారణాలతోనైనా పోలియో చుక్కలు వేయించుకోని వారికి 13, 14, 15వ తేదీల్లో సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించి వారికి పోలియో చుక్కలు వేస్తారని ఆమె వివరించారు.

ఏర్పాట్లు పూర్తి..

బోడుప్పల్: నేడు బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కమిషనర్ శైలజ వెల్లడించారు. బోడుప్పల్‌లో శనివారం ఆమె మాట్లాడుతూ.. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో 0 – 5 ఏళ్ల లోపు చిన్నారులు పోలియో చుక్కలు వేయించుకోవాలని సూచించారు.

ఆర్టీఐపై అవగాహన పెంచుకోవాలి

తహసీల్దార్ సుచరిత



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ సుచరిత

కాప్రా: సమాచార హక్కు చట్టంపై ప్రతి పౌరుడు అవగాహన పెంచుకోవాలని కాప్రా మండల తహసీల్దార్ సుచరిత సూచించారు. సమాచార హక్కుచట్టం-2005 అమల్లోకి వచ్చి 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం కాప్రా మండల తహసీల్దార్ కార్యాలయంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ఈ చట్టం వల్ల కలిగే ప్రయోజనం గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకే సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పారదర్శకత, జవాబుదారితనంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించేందుకు ఈ చట్టం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ ప్రజెంటేషన్ ద్వారా సమాచార హక్కుచట్టం-2005పై అవగాహన కల్పించారు. ఈ చట్టంలో ఉన్న సెక్షన్లు, వాటి అమలు ఏ విధంగా..? జరుగుతున్నాయో.. వివరించారు.

సామాన్యుడి చేతిలో ఆయుధం..

సమాచార హక్కు చట్టం-2005 సామాన్యుడి చేతిలో ఆయుధమని సమాచార హక్కు సాధన సమితి జిల్లా కన్వీనర్ తాడూరి గగన్‌కుమార్ అన్నారు. ఈ చట్టం అమలు ద్వారా అవినీతి తగ్గుతుందని, అవినీతి, అక్రమాలు జరిగితే బయటపెట్టొచ్చన్నారు. ప్రజా ప్రయోజనాల కోసమే తాము ఆర్టీఐ దరఖాస్తులు వేస్తున్నామని, ప్రభుత్వ ఆస్తులు, ప్రభుత్వ భూములు కాపాడేందుకు ఆర్టీఐ ద్వారా దరఖాస్తు చేసినప్పుడు సమాచారం వెంటనే అందించేలా చూడాలని కోరారు. ఈ అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు.

బోడుప్పల్: ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని పీర్జాదిగూడ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు అన్నారు. శనివారం పీర్జాదిగూడ నగర పాలక సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రజల్లో పారదర్శకత, బాధ్యతాయుతమైన పాలన, ప్రభుత్వ వ్యవహారాలపై అవగాహన పెంపునకు ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు ప్రభుత్వ సమాచార సేకరణ, ప్రజాస్వామ్యానికి బలమన్నారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శోభాశంకర్, డీఈ సాయినాథ్‌గౌడ్, ఏఈ వినీల్‌కుమార్‌గౌడ్, మేనేజర్ క్రాంతికుమార్, ఆర్‌ఓ కిశోర్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి పరిష్కారానికి కృషి

అల్వాల్: డివిజన్ రెడ్డి ఎన్‌క్లేవ్‌లో పెరుగుతున్న నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని శనివారం నూతన బోరు పనులను కార్పొరేటర్ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. డివిజన్‌లోని ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. సాజిద్, యాదగిరి, కాలనీవాసులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: 33/11కేవీ మల్లాపూర్ బెల్‌స్టేషన్ పరిధి 11 కేవీ సాండర్డ్ టైల్స్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా నేడు ఉదయం 10 గంటల నుంచి 4 గంటల వరకు మల్లాపూర్ పారిశ్రామికవాడలో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

◆ నాచారం సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ మల్టీస్టీల్ ఫీడర్, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఐడీఏ నాచారం రోడ్డు నెంబర్07,08, వాయిత్ టర్బో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నైల్ ఫీడర్ పరిధిలోని నాచారం ఐడీఏ రోడ్‌నెంబర్ 07,08లో సాయంత్రం 5 గంటల వరకు ముతామెటల్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఐడీఏ నాచారం రోడ్‌నెంబర్ 1,09,12,13,15లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని నాచారం ఏఈ నాగరాజు ప్రకటించారు.

డంపింగ్‌యార్డు కాదు.. ఇంకుడు గుంతే !



చిన్మయిమార్గ్‌లో వ్యర్థాలతో నిండిన ఇంకుడు గుంత

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో భూగర్భ జలాల పరిరక్షణకు ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు డంపింగ్ యార్డులుగా మారుతున్నాయి. జలమండలి అధికారులు గతంలో గౌతంనగర్ డివిజన్ పరిధిలోని దయానంద్‌నగర్, గౌతంనగర్, మల్లికార్జుననగర్, జ్యోతినగర్, గోపాల్‌నగర్, చిన్మయిమార్గ్, మిర్జాలగూడ తదితర ప్రాంతాల్లో భూగర్భ జలాల పరిరక్షణకు రూ.లక్షలు వెచ్చించి ఇంకుడు గుంతలను ఏర్పాటు చేశారు. ఇంకుడు గుంతల పర్యవేక్షణ లేకపోవడంతో పలు ప్రాంతాల్లో ఉన్న ఇంకుడు గుంతలు చెత్త,చెదారాలతో పాటు వ్యర్థాలను వేయడంతో డంపింగ్‌యార్డులుగా మారుతున్నాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇంకుడు గుంతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కార్పొరేటర్ జన్మదిన వేడుకలు



మొక్క నాటుతున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి



మాజీ మంత్రి కేటీఆర్‌తో..

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు, కాలనీ అసోసియేషన్ సభ్యుల మధ్య ఘనంగా నిర్వహించారు. అనంతరం మల్లాపూర్ శివాలయం వద్ద మొక్క నాటి అన్నప్రసాద వితరణ చేపట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావును కలిసిన ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన చదరంగం పోటీలు



కాప్రా: జిల్లాస్థాయి చదరంగం పోటీలు కాప్రా విజయస్కూల్‌లో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉమ్మడి రంగారెడ్డిజిల్లా స్థాయి అండర్-14, 17 చెస్ పోటీలు శనివారం స్కూల్ కరస్పాండెంట్ రాజేశ్వర్ ప్రారంభించారు. ఈ పోటీల్లో మొత్తం 60 స్కూళ్ల నుంచి 400 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. రాజేశ్వర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా ముఖ్యమేనని, విద్యాభివృద్ధిలో క్రీడలు భాగస్వామ్యమేనన్నారు. స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వెంగబాబు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కిష్టయ్య, ప్రభాకర్, సత్యనారాయణ, మదన్మోహన్‌రెడ్డి, వీరారెడ్డి, వినోద్, విద్యాసాగర్, యాదలక్ష్మి, సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



మల్లాపూర్: రెడ్‌క్రాస్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మల్లాపూర్ ఈస్ట్ అన్నపూర్ణకాలనీ అసోసియేషన్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. దాదాపు 100 మంది సీనియర్ సిటిజన్స్ వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ శ్రీకర దరిశెట్టి, పీఎస్ఎన్ చౌదరి, కాలనీ అధ్యక్షుడు డాక్టర్ శేఖర్‌బాబు, ఆంజనేయులు రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు తదితరులున్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు



జమ్మిగడ్డలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన తహసీల్దార్

కాప్రా: ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే ఎంతటివారైనా చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని కాప్రా మండల తహసీల్దార్ సుచిత హెచ్చరించారు. జమ్మిగడ్డలోని సర్వేనంబర్ 376లోని ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారనే ఫిర్యాదుతో రంగంలోకి దిగిన తహసీల్దార్ శనివారం మరోసారి స్థలాన్ని పరిశీలించి, సర్వేయర్‌తో కొలతలు వేసి మార్కింగ్ చేయించారు. ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని బోర్డును ఏర్పాటు చేశారు. స్థలం చుట్టూ తక్షణమే ఫెన్సింగ్ వేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ భూమిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి జీపీఎస్ సాయంతో నిరంతరం పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు. కబ్జాదారుల చెర నుంచి స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమిని ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రజా అవసరాలకు ఉపయోగిస్తామన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న భవనాలకు కూడా నోటీసులు జారీ చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.

నెలన్నరకే 'తారు'మారు !

నిర్మించిన నెలన్నరకే గుంతలు పడిన వైనం

● రూ. లక్షల ప్రజల సొమ్ము రోడ్డు పాలు
● నాణ్యత లోపమే కారణమంటున్న ప్రజలు



ఘట్‌కేసర్ అండర్‌పాస్ రోడ్డుపై ఏర్పడిన గుంత

ఘట్‌కేసర్: రవాణా సౌకర్యం కోసం ప్రభుత్వం ఏటా కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏళ్లతరబడి ఉండాల్సిన రోడ్లు మూన్నాళ్లకే గుంతలుపడి దారుణంగా తయారవుతున్నాయి. ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం సమస్యలకు దారి తీస్తోందని ప్రయాణికులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినాయక నిమజ్జనానికి ఏదులాబాద్ చెరువుకు వచ్చే వందలాది వాహనాలు వెళ్లడానికి మూన్‌లైట్ వైన్స్ ఎదుట తారు రోడ్డు నిర్మించారు. నిర్మించిన నెలన్నరకే గుంతలు ఏర్పడటం నాణ్యత లోపానికి నిదర్శనంగా కనిపిస్తోంది.

నెలరోజులకే చిత్తడిగా..

నెల క్రితం నిర్మించిన రోడ్డుపై అప్పుడే గుంతలు ఏర్పడమేమిటని.. ? స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇంజినీరింగ్ అధికారుల అశ్రద్ధ స్పష్టంగా కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యతకు తిలొదకాలిచ్చి రోడ్డు నిర్మించిన ఇంజినీరింగ్ అధికారులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం...

ఏటా వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం ఏదులాబాద్ వినాయకసాగర్ లక్ష్మీనారాయణ చెరువులోకి వందలాది వాహనాల్లో నగరం నుంచి తీసుకొస్తుంటారు. ఘట్‌కేసర్ పట్టణంలో ట్రాఫిక్ సమస్య తలెత్తేదని ఉప్పల్, ఈసీఐఎల్ వైపు నుంచి వాహనాలు పట్టణంలోకి రాకుండానే ఏదులాబాద్ చెరువుకు చేరుకోవడానికి అండర్ పాస్ వద్ద థార్ రోడ్డు నిర్మించారు. లక్షలు వెచ్చించి నిర్మించిన రోడ్డు పనుల్లో నాణ్యత లోపించడంతో అడుగులోతు గుంతలు ఏర్పడ్డాయి.

దెబ్బతింటున్న వాహనాలు..

వేలాది వాహనాలు నిత్యం రాకపోకలు సాగించే ఈ రహదారిపై ఏర్పడిన గుంతలతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సర్వీస్ రోడ్డు నుంచి ఏదులాబాద్‌కు వెళ్లే వాహనాలు అండర్‌పాస్ రోడ్డు వైపు తిరిగే క్రమంలో పట్టణంలో నుంచి వచ్చే వాహనాలతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో వైన్స్ ముందు ఏర్పడిన గుంతల్లో పడి వాహనాలు దెబ్బతింటున్నాయి. బురదగా మారి వాహనాలు దిగబడి పోతున్నాయి.

వైకుంఠధామాన్ని ఆధునికంగా తీర్చిదిద్దుతాం



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో రూ.3 కోట్లతో నిర్మిస్తున్న వైకుంఠధామాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతామని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్ అన్నారు. శనివారం జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కార్పొరేటర్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డిసెంబర్ చివరి కల్లా పనులు పూర్తవుతాయన్నారు. బర్నింగ్ ప్లాట్‌ఫామ్, టాయిలెట్స్, దింపుడు గళ్లు, పూజా మందిరం, శివుడి విగ్రహం విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. వెన్నెలగౌడ్, ఏఈ రాధిక, స్థానిక నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులు సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలి



పోచారం: సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొంటూ.. సామాజిక బాధ్యత తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బర్కత్‌పురాలోని ఆర్‌బీవీఆర్‌ఆర్ మహిళా ఫార్మసీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రతాపసింగారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత 4 రోజులుగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సేవాభావాన్ని అలవర్చుకోవడం అభినందనీయమన్నారు. ఓయూ ఎన్ఎస్ఎస్ అధికారి విద్యాసాగర్, కళాశాల ప్రిన్సిపాల్ సుమాకాంత్, వాలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



నిర్మించిన మున్నాళ్లకే రోడ్డుపై అడుగులోతు గుంతలు ఏర్పడ్డాయి. ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం ఉందని స్పష్టంగా తెలుస్తోంది. రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి.

– మంకయ్య, మర్పల్లిగూడ

చదును చేయకుండానే రోడ్డు వేశారు..



భూమి చదును చేయకుండానే రోడ్డు నిర్మించారు. వరద నీరు బయటకు వెళ్లేందుకు దారి లేక రోడ్డుపై నిలిచి గుంతలు ఏర్పడుతున్నాయి. వరద నీరు రోడ్డుపై నిల్వకుండా చర్యలు తీసుకోవాలి.

– సుధాకర్‌రెడ్డి, బొక్కొనిగూడ

పనుల్లో నాణ్యత లోపించింది



రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించిందనిపిస్తోంది. గుంతలు ఏర్పడకుండా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలి.

– బొక్క రవీందర్‌రెడ్డి, బొక్కొనిగూడ